ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024



జలుమూరు : కొమనాపల్లి వద్ద వంశధార నది ప్రవాహం

ఉప్పొంగినది

● నాగావళి, వంశధారకు పోటెత్తిన వరదనీటి ప్రవాహం



శ్రీకాకుళం రూరల్ : పెద్దగనగళ్లవానిపేటలో కోతకు గురైన తీరం

పెద్దగనగళ్లవానిపేటలో ముందుకొచ్చిన సముద్రం

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 10: జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నాగావళి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నదిలో భారీగా వరదనీరు చేరడంతో తీర ప్రాంత గ్రామస్థులకు ముంపు భయం వెంటాడుతోంది. నాగావళి నదిలో నీరు.. శ్రీకాకుళం మండలం పెద్దగనగళ్లవానిపేటలోని సముద్ర తీరం(సంగం)లో కలుస్తోంది. మంగళవారం పెద్దఎత్తున నీరు చేరడంతో సముద్రం 600 మీటర్లు ముందుకొచ్చింది. తీరం కోతకు గురై.. బోట్లు, తెప్పలు, వలలు కొట్టుకుపోయాయి. ఈక్రమంలో ఉప్పుటేరు వాగు ద్వారా గ్రామంలోకి నీరు చేరుతుండడంతో పెద్దగనగళ్లవానిపేట వాసులు భయాందోళన చెందుతున్నారు. ఏ క్షణాన ముంపు ముప్పు ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత మైలపిల్లి నర్సింగరావు మత్స్యకారులతో కలిసి తీరంలో పర్యటించారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

హిరమండలం, సెప్టెంబరు 10: తుఫాన్ ప్రభావంతో వంశధార, నాగావళి నదుల్లో వరదనీరు పోటెత్తి ప్రవహిస్తోంది. మూడు రోజులుగా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు మంగళవారం మధ్యాహ్నం హిరమండలంలో వంశధార నదిలో నీటి ప్రవాహం పెరిగింది. గొట్టాబ్యారేజీ వద్ద ఉదయం 8 గంటల వరకు నదిలో 10,686 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా.. మధ్యాహ్నం ఒంటిగంటకు 30,500 క్యూసెక్కులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. టెక్కలి ఆర్డీవో సుదర్శనదొర, ప్రత్యేకాధికారి రమ్మోహన్‌రావు, తహసీల్దార్ వెంకటరమణ బ్యారేజీ వద్దకు చేరుకొని వరద పరిస్థితిని పరిశీలించారు. వంశధార అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం వచ్చిన వరద వలన నదీతీర గ్రామాలకు ఎలాంటి ముప్పు ఉండదని వంశధార అధికారులు తెలిపారు. సాయంత్రం వరద ప్రవాహం క్రమేపీ తగ్గింది. రాత్రి 7 గంటలకు ఇన్‌ఫ్లో 22,356 క్యూసెక్కులు ఉండగా.. బ్యారేజీ 19 గేట్లు పైకెత్తి నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. బ్యారేజీ వద్ద వరద పరిస్థితిని ఈఈ ప్రదీప్, డీఈఈ రంగనాయకులు, ఏఈఈ ధనుంజయ, బి సత్యనారాయణ, పరిశుద్ధబాబు పరిశీలిస్తున్నారు. అంతకు ముందు మహేంద్రతనయ నది అవతల ఉన్న జిల్లేడిపేట గ్రామాన్ని ఆర్డీవో, రెవెన్యూ అధికారులు సందర్శించారు. పడవలో వెళ్లి.. గ్రామంలో వరద పరిస్థితిని తెలుసుకున్నారు.

● భయాందోళనలో తీరప్రాంత వాసులు

జలుమూరు: వంశధార నదికి వరద పోటెత్తి ప్రవహిస్తుండడంతో తీర ప్రాంత గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. జలుమూరు మండలంలో కొమనాపల్లి, అచ్యుతాపురం, నగిరికటకం, సురవరం, దొంపాక మాకివలస లింగన్నాయుడుపేట, పర్లాం, యాతపేట, అంధవరం, రామకృష్ణాపురం, ఉప్పరపేట గ్రామస్థులు ముంపు భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం వంశధార నదికి 30వేల క్యూసెక్కులు నీరు ప్రవహిస్తోందని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. నదీ తీర గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు.



గొట్టాబ్యారేజీ వద్ద వంశధార ప్రవాహం



హిరమండలం : జిల్లేడుపేటకు పడవపై వెళ్తున్న ఆర్డీవో, రెవెన్యూ అధికారులు

వర్షం నష్ట నివేదిక అందజేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 10: భారీ వర్షాల వలన జిల్లాలో కలిగిన నష్టాల వివరాలను బుధవారం నాటికి అందజేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్, డ్వామా, గృహ నిర్మాణశాఖ, వైద్యారోగ్యశాఖ, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'విపత్తులు వచ్చినప్పుడు కాకుండా కంట్రోల్ రూమ్‌కు ఒక శాశ్వత ఫోన్ నెంబర్‌ను కేటాయించాలి. చెరువులు, డ్యాంల నుంచి నీరు ఓవర్‌ఫ్లో అయితే ఇరిగేషన్ ఏఈ, వీఆర్వో, పోలీసులకు సమాచారం అందించి రోడ్డు బ్లాక్ చేయాలి. పునరావాస కేంద్రాలు, పాఠశాలలకు సంబంధించి నష్టం జరిగితే తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాల'ని ఆదేశించారు. 'ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి.. తాగు నీటి పరీక్షలు నిర్వహించాలి. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలి. ఉపాధిహామీ పనులు కొనసాగించాలి. శ్రీకాకుళంలో హౌసింగ్ ప్రోగ్రెస్ తక్కువగా ఉంది. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పాఠశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం డ్రైడేను పాటించాలి' అని సూచించారు. వివిధ శాఖల లక్ష్యాలు, ప్రగతిని సీపీఓ లక్ష్మీ ప్రసన్న కలెక్టర్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.అప్పారావు, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, మండలాల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ఏడురోడ్ల జంక్షన్ వద్ద అఖిలపక్ష నాయకుల రాస్తారోకో

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి

● అఖిలపక్ష నేతల డిమాండ్

అరసవల్లి, సెప్టెంబరు 10: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ప్లాంట్‌కు సంబంధించిన 3 బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో గతంలో ఒక బ్లాస్ట్ ఫర్నేస్ మూతపడింది. ఇప్పుడు మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసేశారు. విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులు ఉండగా.. గతేడాది 45లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది ఇంకా తగ్గిపోతుంది. దీంతో రోజుకు రూ.15కోట్లు నష్టం వస్తోంది. విశాఖ స్టీల్‌ను మరింత నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోంద'ని వారు విమర్శించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస వర్మలు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ విషయంలో టీడీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.హిమాచలం, కౌలురైతు సంఘం కార్యదర్శి వెలమల రమణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వివిధ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మూలపేట పోర్టుకు సంబంధించి నిలిచిన సౌత్‌బ్రేక్ వాటర్ రక్షణ గోడ పనులు

వైసీపీ నిర్లక్ష్యం.. పోర్టుకు శాపం

- ● గత ప్రభుత్వ నిర్వాకంతో అడ్డంకులు
- ● కొలిక్కిరాని భూసేకరణ ప్రక్రియ
- ● పరిష్కారం కాని నిర్వాసితుల సమస్యలు
- ● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(టెక్కలి)

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు మూడు నెలలుగా నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. పోర్టు పనులకు శాపంగా మారింది. ముందుచూపు లేకుండా వ్యవహరించడం.. పనులకు అడ్డంకిగా నిలిచింది. రైలు, రోడ్డు మార్గాలకు సంబంధించి 228.53 ఎకరాల్లో భూసేకరణ ప్రక్రియ ఇప్పటికీ కొలిక్కి రాలేదు. నిర్వాసితులకు కేటాయించిన 50 ఎకరాల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. పోర్టులో పడిన 293.97 ఎకరాల ఉప్పు భూముల సమస్య ఇంకా తేలలేదు. మూలపేటకు చెందిన పలు కుటుంబాల నిర్వాసితులకు పీడీఎఫ్(ప్రాజెక్ట్ డిస్‌ప్లేస్ ఫ్యామిలీ)లు పూర్తిస్థాయిలో చెల్లించలేదు. మరోవైపు సాంకేతిక సమస్యలతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. రెండేళ్లలో పోర్టు పనులు పూర్తిచేసి.. ఉద్యోగాలు కల్పిస్తామన్న గత సీఎం జగన్ హామీలు.. ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఎన్నికల ముందు ప్రచారసభల్లో అధికార పార్టీ నేతలు పోర్టు పనులు త్వరగా పూర్తిచేస్తామన్నారు. పోర్టులో ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఊదరగొట్టారు. అవన్నీ ప్రచారానికే పరిమితమయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే ఆశలు చిగురిస్తున్నాయి.

● హడావుడిగా శంకుస్థాపన

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం.. సంతబొమ్మాళి మండలం భావనపాడులో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు ప్రతిపాదించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన దానిని మూలపేటకు మార్చేసింది. 4,361.91కోట్ల అంచనా వ్యయం తో గతేడాది ఏప్రిల్ 19న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రధాన సమస్యలు పరిష్కారం కాకుండానే హడావుడిగా పోర్టు పనులకు శంకుస్థాపన చేశారు. 'రెండేళ్లలో మూలపేట పోర్టు పూర్తిచేస్తాం. దీని ద్వారా జిల్లాలో 35వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు కల్పిస్తాం. సిక్కోలు ముఖ చిత్రం మారబోతోంది' అంటూ జగన్ ప్రకటించారు. 'మూలపేట పోర్టును నాలుగు బెర్త్‌లతో 24 మిలియన్ టన్నుల సామ ర్థ్యంతో 1250 ఎకరాల్లో నిర్మిస్తాం. రాబోయే రోజుల్లో 100 మిలియన్ల టన్నుల సామర్థ్యానికి పోర్టును మార్పు చేస్తాం. 11 కిలోమీటర్ల మేర ఇటు రోడ్డుమార్గం నేషనల్ హైవే నుంచి, అటు రైల్వే మార్గాన్ని అనుసంధానం చేస్తాం. దీనిద్వారా జిల్లాలో వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మూలపేట కూడా ముంబయి, చెన్నై వంటి నగరాలుగా మార్పు చెందుతుంది. పోర్టు ఆధారిత పరిశ్రమలు కూడా వస్తాయి' అని గొప్పలు చెప్పారు. ఇవన్నీ ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● నిర్వాసితులకు తేలని పీడీఎఫ్

మూలపేట పోర్టు పరిధిలో మూలపేట, విష్ణుచక్రం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 41మందికి పీడీఎఫ్‌లు పంపిణీ జరగలేదు. ఒక్కో పీడీఎఫ్‌కు రూ.9.91లక్షలు కేటాయించారు. పీడీఎఫ్‌లు ప్రకటించిన నాటికి కొంతమందికి 'ఆధార్' కార్డులో వయసులో కొద్దిపాటి తేడాలు ఉన్నాయి. మరికొందరు భూముల వివరాలు నమోదుకాలేదు. ఇంకొందరు కోర్టులను ఆశ్రయించడంతో కొన్ని పీడీఎఫ్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక నౌపడా దరి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి కేటాయించిన 50 ఎకరాలు లోతట్టు ప్రాంతం కావడంతో నిర్వాసితులకు మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

● కొలిక్కిరాని భూసేకరణ

మూలపేట పోర్టు భూసేకరణ ఇప్పటికీ కొలిక్కి రాలేదు. రోడ్డు మార్గానికి సుమారు 156 ఎకరాలు భూమి అవసరం. కాగా, ల్యాండ్‌ఎక్విజేషన్ కింద ఒక్కో గ్రామానికి ఒక్కో రీతిలో పరిహారం డబ్బులు చెల్లించడం విమర్శలకు తావిచ్చింది. మార్కెట్ ధరతో సమానంగా ఉన్నవాటికి కూడా కొన్నింటికి అధికంగా చెల్లించారు. మరికొన్నింటికి పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికే కస్పానౌపడా ప్రాంతంలో ఎకరా72సెంట్ల భూమికి సంబంధించి టెక్కలి ప్రాంతానికి చెందిన తిర్లంగి భాగ్యలక్ష్మి.. తనకు తెలియకుండానే భూసేకరణ చేశారంటూ హైకోర్టును ఆశ్రయించింది. మరోవైపు 10.6 కిలోమీటర్ల రైలు మార్గానికి అవసరమైన 72ఎకరాల భూమికి సంబంధించి పోతునాయుడుపేట, యామాలపేట, కాశీపురం, కోటపాడు, రాజపురం, కూర్మనాథపురం గ్రామాల రైతులకు సంబంధించి చెల్లింపుల ప్రక్రియ ఇంకా జరగలేదు.

● తేలని ఉప్పు భూముల సమస్య

ప్రస్తుతం పోర్టుకు కేటాయించిన 826.51 ఎకరాల్లో 293.97 ఎకరాలు ఉప్పు భూముల వ్యవహారం కొలిక్కి రాలేదు. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.4లక్షలు ఉందని అధికారులు చెబుతుండగా.. సాల్ట్‌బోర్డు కమిషనర్ ఎకరాకు సుమారు రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటు జిల్లా యంత్రాంగానికి, సాల్ట్‌బోర్డు కమిషనర్ మధ్య పలుదఫాలు చర్చలు జరిగినా.. ఉప్పు భూముల సమస్య తేలలేదు.

● సాంకేతిక అడ్డంకులు

పోర్టు శంకుస్థాపన జరిగిన తరువాత విశ్వసముద్ర సంస్థ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టింది. నార్త్‌బ్రేక్, సౌత్‌బ్రేక్ గట్లు వేయడం, డ్రెజ్జింగ్ పనులు కొంతమేరకు చేపట్టింది. అయితే సౌత్‌బ్రేక్ రక్షణగోడ 2,455మీటర్లు నిర్మించాల్సి ఉన్నా ఇంకా పూర్తికాలేదు. ఈ నిర్మాణ సమయంలో చిన్నపాటి తుఫాన్లకు సౌత్‌బ్రేక్ రక్షణగోడపై ఉన్న ఇసుక మేటలు సముద్ర కెరటాలకు కరిగిపోయింది. ఇక 15.85 మిలియన్ క్యూబిక్‌మీటర్ల డ్రెజ్జింగ్ పనులు జరగాల్సి ఉన్నా.. అసంపూర్తిగా వదిలేశారు. ఇక సౌత్, నార్త్‌బ్రేక్ రక్షణ గోడలు.. కెరటాల ఉధృతిని తట్టుకునేందుకు రెండుపక్కల వేయాల్సిన యాంగర్స్ నిర్మాణాలు సుమారు 20 శాతం కూడా పూర్తికాలేదు. ఇలా 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' అన్న చందంగా పనులు నిలిచిపోయాయి.

● సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం టెక్కలిలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. పోర్టుకు గ్రావెల్, రాళ్లు తరలిస్తున్న భారీ వాహనాల మూలంగా రోడ్లు ఛిద్రమవుతున్నాయని, వెంటనే వాహనాలు నిలిపివేయాలని సూచించారు. అలాగే గత నెల 31న రావివలస సచివాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ పోర్టు లోపాలు సరిదిద్ది త్వరలో పనులు చేపడతామని తెలిపారు. ఈ దిశగా చర్యలు చేపట్టి.. పోర్టు పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.



పూర్తికాని డ్రెడ్జింగ్ పనులు

అక్టోబరుకు.. పూర్తయ్యేనా?

● అంగుళం కూడా కదలని పనులు ● ఇదీ టిడ్కో గృహాల పరిస్థితి



టిడ్కో గృహ సముదాయంలో అంతర్గత రహదారుల దుస్థితి ఇది..



నిర్మాణంలోనే మంచినీటి సరఫరా పనులు..

పలాస, సెప్టెంబరు 10: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో టిడ్కో (టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) గృహాలను అక్టోబరు నాటికి లబ్ధిదారులకు అందించాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్నా.. ఇప్పటివరకూ అంగుళం పని కూడా జరగలేదు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే.. పనులు పూర్తయ్యే పరిస్థితి నెలకొంది. 2014-19 సంవత్సరాల మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ ప్రజల కోసం జాతీయరహదారి బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో మొత్తం 1968 గృహాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. లబ్ధిదారుల భాగస్వామ్యంతో సరసమైన గృహాలు (అఫ్రెడబుల్ హౌసింగ్ ఇన్ పార్టనర్‌షిప్-ఏహెచ్‌పీ) నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు టాటా నిర్మాణ సంస్థకు పనుల బాధ్యతను అప్పగించింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణ పనుల్లో మతలబు ఉందంటూ.. టెండర్లు రద్దు చేసింది. రివర్స్ టెండర్లకు శ్రీకారం చుట్టింది. అప్పటికే 980 గృహాల నిర్మాణం 80 శాతం వరకూ పూర్తయ్యాయి. వాటినే పూర్తి చేసి ఇచ్చేందుకు లబ్ధిదారుల నుంచి బ్యాంకు ఖాతాలు ప్రారంభించి వారికి రుణాలు మంజూరు చేసింది.

లబ్ధిదారులు ప్రతినెలా వడ్డీ, అసలు కట్టుకుంటున్నారు తప్ప.. పనులు మాత్రం ఇప్పటికీ జరగడం లేదు. గత ఐదేళ్లలో రహదారులు, కాలువలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీరు ఊసే లేకుండా పోయింది. పూర్తయిన గృహాల్లోకి ఎవరూ వెళ్లకుండా రేకులు వేసి జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం నిర్మాణ ప్రాంతంలో కేవలం సెక్యూరిటీగార్డులు తప్ప కార్మికులు ఎవరూ లేరు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గృహాల నిర్మాణంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ నాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని కాంట్రాక్టర్లు హామీ ఇచ్చినా ఆ మేరకు పనులు సాగకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. లబ్ధిదారులు ప్రతిరోజు ఆ గృహ సముదాయానికి వెళ్లి పనులు జరుగుతున్నాయో లేదో పరిశీలిస్తు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

(నిన్నటి దిక్సూచి తరువాయి)

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యత పరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు

1. బహుళ ప్లాట్‌ఫాం నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అమలు



లోకి వస్తుంది.

● ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.

● బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

● అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.

● అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.
2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.
3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిక్సూచి

Santoor Scholarship

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have: • passed Class 10 from a local government school. • passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And • enrolled in a full-time graduate programme starting in 2024-25.

• Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. • Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum

Last Date to Apply: 23-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT
Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

• Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 20-09-2024

Url: www.b4s.in/aj/ASPI2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



హై వోల్టేజ్ యాక్షన్‌తో వస్తున్నాం

ఎన్టీఆర్

'ఆర్ఆర్ఆర్' చిత్రం తర్వాత నా సోలో మూవీగా 'దేవర' మీ ముందుకొస్తోంది. కొంచెం ఒత్తిడిగా ఉంది. రిలీజ్ కోసం మీతో పాటు నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. హై వోల్టేజ్ యాక్షన్‌తో ఈ చిత్రం రాబోతోంది' అని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. మంగళవారం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. కరడుగట్టిన సముద్ర దొంగల నుంచి గ్రామాన్ని రక్షించేందుకు కథానాయకుడు చేసిన పోరాటం నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. తండ్రీ కొడుకులుగా రెండు విభిన్న పాత్రల్లో ఎన్టీఆర్ పలికించిన భావోద్వేగాలు అలరించాయి. పల్లెటూరి యువతిగా జాన్వీ కనిపించారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'దేవర విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. సముద్ర జలాలఅడుగున చిత్రీకరణ చేశాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. శివ కొరటాల మాట్లాడుతూ 'సెట్స్‌లో ఒక్కసారి కెమెరా ఆన్ అయిందంటే ఎన్టీఆర్ సర్వం మర్చిపోయి పాత్రలో లీనమై నటిస్తాడు. అప్పట్లో సీనియర్ ఎన్టీఆర్-శ్రీదేవిలా ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్-జాన్వీకపూర్ జోడీ బాగుందని ప్రేక్షకులకు మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. జాన్వీకపూర్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో కలసి నటించాలనే నా కోరిక 'దేవర'తో తీరింది. ఆయనకు నేను పెద్ద అభిమానిని. ఎన్టీఆర్ నుంచి నటనకు సంబంధించి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను' అని తెలిపారు.



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర జంటగా నటించిన 'ఉత్సవం' చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో రెజీనా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చిత్రవిశేషాలు వెల్లడించారు.

కాలేజ్ రోజులు గుర్తొచ్చాయి

● ఈ చిత్రకథను దర్శకుడు అర్జున్ సాయి చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. కథలో సోల్ ఉంది. నాటకరంగం గురించి ఆయన చాలా రిసెర్చ్ చేసి కథ తయారు చేశారు. స్కూల్‌లో, కాలేజీలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వెయ్యడం, టికెట్లు అమ్మడం.. ఇవన్నీ నాకు వెంటనే గుర్తొచ్చాయి. సినిమాలో రంగస్థల నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి. 'ఉత్సవం' సందేశాత్మక చిత్రం కాదు. కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా. నాకు బాగా నచ్చి వెంటనే ఒప్పుకొన్నా.

● చిత్రంలో నేను కార్పొరేట్ ఎంప్లాయిగా నటించాను. ప్రేమ మీద నా పాత్రకు పెద్దగా ఆసక్తి ఉండదు. కథలో ఎంతో కీలకమైన పాత్ర. ఇటువంటి పాత్ర చేసే అవకాశం రావడం ఆనందంగా అనిపించింది.

● నా కో స్టార్ దిలీప్ మంచి నటుడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. తనతో వర్క్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నటుడిగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. అలాగే రాజేంద్రప్రసాద్, ప్రకాశ్‌రాజ్, నాజర్ వంటి సీనియర్స్‌తో కలసి నటించడం వల్ల చాలా నేర్చుకున్నాను. దర్శకుడు అర్జున్ సాయి తన తొలి సినిమాకు ఇలాంటి గొప్పకథను ఎన్నుకోవడం, ఆయనకు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ సపోర్ట్ ఇచ్చి సినిమాను విడుదల చేయడం హ్యాపీగా అనిపిస్తోంది.

● నా తొలి సినిమా 'ఎస్.ఎం.ఎస్.' చేస్తున్నప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నాను. అందుకే ఇన్నాళ్లూ విభిన్న పాత్రలు చేస్తూ వచ్చాను. అన్ని రకాల పాత్రలు చేయడమే నా గోల్

కొన్నేళ్లుగా బాలీవుడ్ బాక్సాఫీసు.. థియేటర్లు సరైన హిట్లు లేక వెలవెలబోతున్న సంగతి తెలిసిందే. అలాంటి సమయంలో నేనున్నానంటూ బాలీవుడ్‌ను ఆదుకున్నాయి కొన్ని సినిమాలు. విచిత్రమేమిటంటే అందులో అధిక శాతం 'హారర్' జానర్‌కు చెందిన చిత్రాలే. అలా ఈ ఏడాది బాక్సాఫీస్‌కు కళ తెచ్చిన తెచ్చిన హారర్ చిత్రాలేంటో.. అలాగే త్వరలో ప్రేక్షకులను పలకరించే చిత్రాలేంటో చూద్దాం.

బాక్సాఫీస్‌కు హారర్ జోరు


ఏ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా రిలీజై సంచలన విజయం సాధించిన చిత్రం 'ముంజ్య'. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో అభయ్ వర్మ, శర్వారీ, మోనా సింగ్ కీలక పాత్రలు పోషించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో జూన్ 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో తన ప్రేయసిని ముంజ్యా (బ్రహ్మ రాక్షసుడు) నుంచి కాపాడుకునేందుకు హీరో పడే పాట్లు.. చేసే ఫీట్లు అందర్నీ తెగ నవ్వించాయి. పిల్లలను నిద్రపుచ్చడానికి పెద్దలు చెప్పే జానపద కథలా.. కామెడీ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే ఓటీటీలో విడుదలై అందరినీ అలరిస్తోంది.











వసూళ్ల వర్షం

శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నేచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2'. ఇది 2018లో తెరకెక్కి సూపర్ హిట్ సాధించిన 'స్త్రీ' సినిమాకు సీక్వెల్. రాజ్‌కుమార్ రావు కథానాయకుడు. ఆగస్టు 15న విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ఇప్పటికే ఈ చిత్రం దాదాపు రూ.530 కోట్లు వసూలు చేసింది. బాలీవుడ్‌లో 'ఫైటర్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలు సాధించిన కలెక్షన్లను అధిగమించింది. అంతేకాకుండా షారుక్ ఖాన్ నటించిన 'పఠాన్' చిత్రం ఇండియాలో సాధించిన లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసి.. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధించిన రెండో హిందీ మూవీగా 'స్త్రీ 2' నిలిచింది. ఈ కలెక్షన్ల పరంపర ఇలాగే కొనసాగితే త్వరలోనే ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లతో టాప్ ప్లేస్‌లో ఉన్న షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాను దాటేస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక, ఈ సినిమా కథాంశానికి వస్తే.. చందేరి అనే ఓ ఊరిలో హఠాత్తుగా మహిళలు కనిపించకుండా పోవడం, వారిని కాపాడడం కోసం రాజ్‌కుమార్ రావు, తన స్నేహితులతో చేసే పనులు ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ.. ప్రేక్షకులకు సూపర్ థ్రిల్‌ను పంచాయి. అలాగే, ఈ సినిమాకు తమన్నా చేసిన ప్రత్యేక గీతం కూడా కలిసొచ్చింది. ఇప్పటివరకూ దేశంలో తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమా కూడా ఇదే. ఈ సినిమాకు మూడో భాగం ఉన్నట్లు చిత్రబృందం తెలిపింది.

మూడు రెట్ల లాభాలు

అజయ్ దేవ్‌గణ్, ఆర్.మాధవన్, జ్యోతిక నటించిన హారర్ థ్రిల్లర్ 'షైతాన్'. వికాశ్ భల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 8న విడుదలై మంచి హిట్‌గా నిలిచింది. రూ.65 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. ఇందులో మాధవన్ వశీకరణం మాయలో పడిన తన కూతురిని రక్షించుకోవడం కోసం అజయ్‌దేవ్‌గణ్ చేసే పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలిచింది. త్వరలోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'షైతాన్ 2'ని తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

త్వరలో మరిన్ని..

'స్త్రీ 2' చిత్రం ఊహకు మించిన సక్సెస్ సాధించడంతో బాలీవుడ్ చూపు ఒక్కసారిగా హారర్ ఫ్రాంఛైజీలపై పడింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న హారర్ చిత్రాల్లో 'భూత్ బంగ్లా', 'భేడియా 2', 'భూల్ భులయ్యా 3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'భూత్ బంగ్లా' చిత్రం అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా, ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ హారర్ కామెడీని అక్షయ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా ప్రకటించారు. 'భేడియా 2' విషయానికి వస్తే.. ఇది 2022లో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటించిన 'భేడియా' చిత్రానికి సీక్వెల్. కృతి సనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకుడు. ప్రస్తుతం రెండో భాగం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మరోవైపు, 'భూల్ భులయ్యా 3' చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, త్రిప్తి దిమ్రి నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని రాబట్టాయి. మూడో భాగం దీపావళి సందర్భంగా నవంబర్ 1న విడుదలవుతోంది. వీటిలో ఏ చిత్రాలు 'స్త్రీ 2' లాగా సంచలన విజయాలు సాధిస్తాయో అని అందరూ వేచి చూస్తున్నారు.



ప్రభాస్‌కు కమల్ గిఫ్ట్..



కమల్ హాసన్ 'కేహెచ్' హౌస్ ఆఫ్ ఖద్దర్ అనే బ్రాండ్‌తో ఖాదీ దుస్తుల వ్యాపారంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే, న్యూయార్క్‌లో జరిగిన ఫ్యాషన్ వీక్‌లో ఈ దుస్తులకు చెందిన సరికొత్త కలెక్షన్ 'సుటూర'ను ప్రదర్శించారు. ఈ సరికొత్త కలెక్షన్‌ను కమల్ హాసన్ తన 'కల్కి 2898 ఏ.డీ' కో స్టార్ ప్రభాస్‌కు కానుకగా పంపారు. ఈ కానుకను అందుకున్న ప్రభాస్.. తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ప్రేమతో ఈ గిఫ్ట్ పంపించినందుకు కృతజ్ఞతలు కమల్ సర్. మీ కొత్త కలెక్షన్‌కు ఆల్ ద బెస్ట్" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో.. భైరవ పాత్రలో ప్రభాస్.. 'సుప్రీమ్ యాస్కిన్' పాత్రలో కమల్ హాసన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే.

విజయంపై నమ్మకంతో ఉన్నాం




మలయాళ హీరో టోవిన్ థామస్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఏఆర్ఎం' (అజయంతే రందం మోషణం). జితిన్ లాల్ దర్శకుడు. కృతిశెట్టి, ఐశ్వర్యారాజేశ్, సురభి లక్ష్మి కథానాయికలు. ఈ నెల 12న పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా టోవినో థామస్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్ అంటే తెలుగు పరిశ్రమలో ఒక బ్రాండ్. వారు మా సినిమాను తెలుగులో విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఇందులో మూడు పాత్రలు చేశాను. కృతి శెట్టి పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. కృతిశెట్టి మాట్లాడుతూ 'హీరోయిన్‌గా నాకు ఇది తొలి మలయాళ చిత్రం. దర్శకుడు అద్భుతమైన కథతో ఎనిమిదేళ్ల పాటు కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.



వరదబాధితులను ఆదుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి నిర్మాత దిల్‌రాజు, శిరీష్ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. వారు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి రూ. 25 లక్షల చెక్కును అందజేశారు.

రాముడిగా...పరశురాముడిగా?



రణ్‌బీర్‌కపూర్ శ్రీరాముడి పాత్రధారిగా 'రామాయణ్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రాతో కలసి యష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీతమ్మవారి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నారు. యష్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సన్నీడియోల్, లారాదత్తా, రకుల్ ప్రీత్‌సింగ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. 2026లో తొలి భాగం విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బాలీవుడ్‌లో వినిపిస్తోంది. రణ్‌బీర్‌కపూర్ ఇందులో డబుల్ రోల్‌లో కనిపించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రాముడి పాత్రతో పాటు పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించనున్నారట. ఆయన లుక్ కూడా సరికొత్తగా ఉండబోతోందని చెబుతున్నారు. రామాయణంలో సీతా స్వయంవరంలో శ్రీరాముడు శివ ధనుర్భంగం నేపథ్యంలో పరశురాముడి పాత్ర కనిపిస్తుంది. 'రామాయణ్'లో అమితాబ్ బచ్చన్ కూడా భాగమవబోతున్నారట. అయితే ఆయన ఈ చిత్రంలో నటించడం లేదు. జటాయు పక్షి పాత్రకు అమితాబ్‌బచ్చన్ డబ్బింగ్ చెప్పేందుకు అంగీకరించాని సమాచారం. ఇక ఈ చిత్రంలో రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ డిసెంబర్‌లో చిత్రీకరణలో పాల్గొంటారని చెబుతున్నారు.

శింబు సాయం



ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడానికి భాషా పరిమితులు, ప్రాంతీయ భేదాలు ఉండవని తమిళ హీరో శింబు నిరూపించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులకు గురైన వారిని ఆదుకోవడానికి ఆయన ముందుకు వచ్చారు. ఇతర తమిళ హీరోలందరికన్నా ముందుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తన వంతు సాయంగా రూ. ఆరు లక్షల విరాళం ప్రకటించి తన మంచితనాన్ని చాటుకున్నారు. అందరూ ఈ విపత్తు నుంచి త్వరలో బయటపడాలని ఆయన కోరుకున్నారు.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌కు జరిగిన తాజా ఎన్నికల్లో అధ్యక్షపదవికి ప్రతాని రామకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదహారు వేల మంది సభ్యులున్న అసోసియేషన్‌కు ఇలా అధ్యక్షపదవికి ఆయన ఎన్నిక కావడం ఇది ఆరోసారి. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు. ఈ రెండేళ్ల పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఔట్‌డోర్ షూటింగ్స్ సమయంలో యూనిట్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, చిన్న సినిమాలకు రాయితీలు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం' అని చెప్పారు.

లైఫ్ స్టోరీ

కొత్తగా..



ఒక్కోసారి సాధారణ సంఘటనలే జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. అలా జీవితంలోని రోజువారీ క్షణాలను మనసుకు హత్తుకొనే విధంగా తీసిన సంకలన చిత్రం 'లైఫ్ స్టోరీస్'. ఈ నెల 14న విడుదలవుతున్న ఈ సినిమాలో సత్య కేతినీడి, షాలిని కొండేపూడి, దేవియాని శర్మ, ఎం. వివాన్ జైన్ తదితరులు నటించారు.అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా స్వీయ దర్శకత్వంలో ఉజ్వల్ కశ్యప్ ఈ సినిమాను నిర్మించారు.

వరహాల గెడ్డపై వంతెన నిర్మించండి

● ఎమ్మెల్యే శిరీషకు విన్నవించిన కూటమి నాయకులు



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

పలాసరూరల్: పలాస మండలం బ్రాహ్మణతర్లా వద్ద వరహాల గెడ్డపై వంతెన నిర్మించాలని టీడీపీ, జనసేన నాయకులు ఎమ్మెల్యే గౌతు శిరీషకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రాహ్మణతర్లాకు ప్రధాన ఆయువుపట్టుగా ఉన్న వరహాల గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిందన్నారు. దీనిపై వంతెన నిర్మిస్తే బ్రాహ్మణతర్లాతో చుట్టుపక్కల అన్ని గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆళ్ల వెంకట్రావు, వడ్డి యాదగిరి, ఆర్.సుధాకర్, బమ్మిడి ఆనంద్, ఎర్ర వెంకట్, తుంగాన సింహాచలం, బెండిరమేష్, నీల్‌బ్రహ్మ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలసిన మత్స్యకార నాయకులు

పలాస/వజ్రపుకొత్తూరు: జిల్లాలో త్వరలో జరగనున్న మత్స్యకార సొసైటీ అధ్యక్ష ఎన్నికల్లో టీడీపీ మద్దతతో పోటీచేయనున్న బుడగట్లపాలెంకు చెందిన చీకటి శ్రీరాం మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిశారు. తనకు మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, మత్స్యకార నాయకులు సూరాడ మోహనరావు, గోవింద పాపారావు, గుల్ల చిన్నారావు, సూరాడ దాసురాజు, ధనరాజు, బైపల్లి నారాయణ, శ్రీరంగం పాల్గొన్నారు.

పర్యావరణానికి విఘాతం కలిగిస్తే చర్యలు

పర్యావరణానికి విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే శిరీష అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ పాలకులు కొండలను పిండి చేసి పచ్చదనం లేకుండా చేశారని దుయ్యబట్టారు. అక్రమంగా కంకర తరలిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి



కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే నడపాలని, ప్రైవేటీకరణను ఆపాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం కాశీబుగ్గ పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గణపతి, సీహెచ్ వేణుగోపాల్, అజయ్‌కుమార్, శ్రీనివాస్, రామారావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌ను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి



కె.కొత్తూరు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

టెక్కలి: కె.కొత్తూరు పీహెచ్‌సీ పరిధి టెక్కలి సచివాలయం-3లో పనిచేస్తున్న ఆశవర్కర్ సనపల సరస్వతిని వేధించిన ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీపై చర్యలు తీసుకోవాలని ఏపీ వలంట్రీ హెల్త్‌వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి అన్నారు. మంగళవారం కె.కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశవర్కర్లతో కలసి ఆమె నిరసన తెలియజేశారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వేధింపులను భరించలేక సరస్వతి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టి టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతుందన్నారు. దీనికి కారణమైన ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీని సస్పెండ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

పలాసరూరల్: రామకృష్ణాపురం కాలనీలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆర్డీవో భరత్‌నాయక్ అధికారులను ఆదేశించారు. పలాస రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో తహసీల్దార్, మున్సిపల్, సచివాలయం అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తయిన ఇళ్లు, స్లాబ్, పునాదుల లెవల్ వరకు జరిగిన నిర్మాణాలు, అసలు పనులు ప్రారంభించని గృహాలు, తదితర వివరాలను అందజేయాలని ఆదేశించారు. రానున్న డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ బి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోటబొమ్మాళి: మండలంలో కురిసిన వర్షాలతో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయిందని, దీనివల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టడంతో పాటు బావులు, పాఠశాలల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు. వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందించి.. స్వచ్ఛందంగా గోతులను పూడ్చి..



గోతుల్లో క్రషర్‌బుగ్గి వేయిస్తున్న మన్మథరావు

టెక్కలి: గోపినాథపురం రైల్వేగేటు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను తొలుసూరుపల్లి పంచాయతీ జయకృష్ణాపురం గ్రామానికి చెందిన సత్తారు మన్మథరావు తన సొంత నిధులను ఖర్చు చేసి పూడ్చి వేయించాడు. ఈ మార్గంలో సబ్‌కలెక్టర్, ఆర్అండ్‌బీ కార్యాలయాలు ఉండడంతో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, రోడ్డుపై ఉన్న గోతులతో వారు ఇబ్బందులు పడుతున్నా అటు ఆర్అండ్‌బీ గానీ, ఇటు రైల్వేశాఖ గానీ పట్టించుకోలేదు. దీంతో మన్మథరావు స్పందించి మంగళవారం క్రషర్‌బుగ్గి లోడ్లు తెచ్చి గోతులను పూడ్చారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు. ● టెక్కలి మేజర్‌పంచాయతీ మండాపోలం కాలనీలో రోడ్డుపై నిలిచిపోయిన నీటిని ఆ కాలనీవాసులు చందాలు వేసుకొని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత కొండవూరు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా ఉద్దానం గోపినాథపురంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో కొండవూరు జట్టు విజేతగా నిలిచింది. కిడిసింగి, నరసన్నపేట, కివిటి అగ్రహారం జట్లు ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానాల్లో నిలిచాయి. విజేతలకు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పచ్చ ఈశ్వరరావు, టీడీపీ నేత మదనాల జోగారావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కూటమినాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కడపల గెడ్డకు పోటెత్తిన వరద

● రెండు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఎల్.ఎన్.పేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో కురిసిన భారీ వర్షాలకు కడపల గెడ్డకు వరద పోటెత్తింది. దీంతో తురకపేట, వాడవలస గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట గ్రామాల మీదుగా లక్ష్మీనర్సుపేట జంక్షన్‌కు చేరుకుని అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం వంశధారలో వరద పెరుగుతుండడంతో నదీతీర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వాడవలస వద్ద నది గట్టు కోతకు గురైతే గ్రామంలోకి నీరుచొరబడుతుందని ఆ గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ● వంశధారలో నీటిమట్టం పెరుగుతుండడంతో బసవరాజుపేట, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి పి.కిరణ్‌కుమార్ పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.



జలుమూరు:కొమనాపల్లిలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

నదీ తీర గ్రామాల్లో దండోరా

జలుమూరు: వంశధార నదిలో వరద ఉధృతి పెరగడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. కొమనాపల్లి, సురవరం, దొంపాక, అందవరం, పర్లాం, రామకృష్ణాపురం తదితర నదీ తీర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. వరద ఉధృతి తగ్గే వరకు వంశధార నది వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

నరసన్నపేట: సుందరాపురం, మామిడివలస, గోపాలపెంట, కంబకాయి తదితర గ్రామాల్లో వరద నీటిలో ఉన్న వరి పొలాలను వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. వాటిని రక్షించుకునేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. ● వంశధారలో నీటి మట్టం పెరగడంతో మండల ప్రత్యేకాధికారి, బీసీ సంక్షేమశాఖ అధికారి అనూరాధ నదీతీర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. మడపాం, బుచ్చిపేట, చేనులవలస, అంబాజీపేట, లుకలాం, కొబగాం, గెడ్డవానిపేట గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

వర్షాల నష్టంపై వివరాలు అందజేయండి

టెక్కలి: మండలంలో వర్షాలకు జరిగిన నష్టాలపై వెంటనే వివరాలు అందజేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.శైలజ అన్నారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పంటల ముంపు, చెరువులు, వాగులకు గండ్లు, రోడ్లపైకి నీరు, తాగునీటి పథకాల ఇక్కట్లు, కూలిన గోడలు, ఇళ్లు, పాఠశాలలు, ఐసీడీఎస్ భవనాలకు కలిగిన నష్టం వంటి వివరాలు తెలియజేయాలని ఆమె కోరారు. మండలంలో నష్టం పెద్దగా లేదని పలు శాఖల అధికారులు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, వ్యవసాయశాఖ ఏవో రంగారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎల్ఎన్‌పేట: వాడవలస వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

తంపర భూముల పరిశీలన..

సుసరాం(పోలాకి): సుసరాంలో తంపర ముంపు పొలాలను మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంత్రి నర్సింహమూర్తి పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ● వర్షాలతో పంటలకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్ తెలిపారు. సుసరాం, డీఎల్ పురం, సత్రవుపేట, ప్రియాగ్రహారం తదితర గ్రామాల్లో రాగోలు వ్యవసాయ శాస్త్రవేత్తలతో పర్యటించి పంట అంచనా నమోదు చేశామన్నారు. మండలంలో 60 ఎకరాల్లో వరిపంట నీటమునిగిందని తెలిపారు.

రాష్ట్ర పండగగా కొత్తమ్మతల్లి జాతర

● రూ.కోటి మంజూరు చేసిన ప్రభుత్వం



కోటబొమ్మాళి/టెక్కలి: కొత్తమ్మతల్లి జాతరను రాష్ట్ర పండగగా నిర్వహించేందుకు దేవదాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఉత్సవాల నిర్వహణకు కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్సవాలు అక్టోబరు 1 నుంచి 3 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు.

హర్షాతిరేకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కొత్తమ్మతల్లి ఉత్సవాన్ని రాష్ట్ర పండగగా నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకోవడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ కొత్తమ్మతల్లి ఉత్సవాలు నామమాత్రంగా జరిగాయి. వైసీపీ నాయకులు వర్గాలుగా విడిపోయి దేవాదాయశాఖ అధికారులు, సిబ్బందిపై దాడులు చేసిన సంఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉత్సవాల నిర్వహణకు కోటి రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో అమ్మవారి ఆలయానికి రంగులు, బారికేడ్లు, గేట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన, విద్యుద్దీకరణ, మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, పగటివేషాలు, వివిధ రకాల ఆటల పోటీలు వంటివి నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

పాలకుల కుట్రలను ప్రతిఘటించాలి

● కామ్రేడ్ల స్మారక సభలో వామపక్ష నాయకుల పిలుపు

పలాసరూరల్: ఆదివాసీలను అంతమొందించేందుకు పాలకుల చేస్తున్న కుట్రలను ప్రతిఘటించడమే అమరవీరులకు నిజమైన నివాళులని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రకమిటీ సభ్యుడు తాండ్ర ప్రకాశ్ అన్నారు. లొత్తూరు పంచాయతీ పెదగంతారులో కామ్రేడ్లు కుమారన్న, సీతారాములు వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రకాశ్ హాజరై మాట్లాడారు. ప్రస్తుతం మధ్యభారతదేశంలో కార్పొరేటీకరణ, సైనీకరణను శక్తివంతంగా ఎదుర్కొంటున్న ఆదివాసీలను చంపేయాలనే కుట్రతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తుందని, వాటిని దీటుగా ఎదుర్కొని తిప్పికొట్టాలని అన్నారు. స్మారక కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ మాట్లాడుతూ.. శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగం, పీడిత ప్రజల అభ్యుదయ పోరాటాల్లో పాల్గొని కుమారన్న, సీతారాములు ప్రాణాలు వదిలారని, వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముందుగా కుమారన్న, సీతారాములు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు కుసుమ, పీవైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ప్రజాసంఘాల నాయకులు కుత్తుమ వినోద్, పోతనపల్లి మల్లేశ్వరరావు, అరుణ, నీలకంఠం, సన్యాసిరావు, నేతింటి నీలంరాజు, బర్ల గోపి పాల్గొన్నారు. **హరిపురం:** మందస మండలం కొండలోగాంలో కుమారన్న, చిలకమ్మ, సీతారాముల స్మారక స్తూపం వద్ద కుమారన్న వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు ఎం.మల్లేశ్వరరావు, పత్రి దానేసు, జుత్తు వీరాస్వామి, మామిడి భీమారావు, సోమేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.



హరిపురం:కొండలోగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వరద బాధితులకు ఆపన్నహస్తం అందించండి

● రూ.50వేలు అందజేసిన కిల్లాం గ్రామస్థులు



రూ.50వేలు చెక్కును ఎమ్మెల్యేకు అందజేస్తున్న కిల్లాం గ్రామస్థులు

నరసన్నపేట: విజయవాడ వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కిల్లాం యువజన సంఘ సభ్యులు సేకరించిన రూ.50వేలను ఎమ్మెల్యేకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఆర్‌బీ రామన్న, ఉప సర్పంచ్ పొట్నూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధులు దూరం

జలుమూరు: వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని జలుమూరు వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. టెక్కలిపాడు, గొల్లపేట గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వేడి పదార్థాలను తినాలన్నారు. భోజనం ముందు, మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు కడుక్కోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి చిన్నరాజులు, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఎపిహెచ్‌వో స్వాతి, హెల్తు అసిస్టెంట్లు చిన్నారావు, రవి, వెంకటరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సంతబొమ్మాళి: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆకాశలక్కవరం ప్రాథమికోన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు మంగళవారం నిర్వహించారు. వీరిలో ఐదుగురికి ఉచిత కళ్లద్దాల కోసం సిఫారసు చేసినట్లు ఆప్తాలమిక్ అసిస్టెంట్ ఎంఆర్ దాస్ తెలిపారు. హెచ్ఎం కనకరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులు

హిరమండలం: జీవో 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థంలేకుండా పోయిందని హిరమండలం, చొర్లంగి పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారంతా నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారు. వైద్యాధికారులు సాయిగీతిక, ఫరూక్‌హుస్సేన్, యశ్వంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. **తురకపేట (ఎల్.ఎన్.పేట):** ప్రభుత్వం జారీచేసిన 85జీవోకు వ్యతిరేకంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తురకపేట పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.లక్ష్మీదీప్ అన్నారు. మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. **మెళియాపుట్టి:** జీవో నెంబర్ 85కి వ్యతిరేకంగా వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మెళియాపుట్టి, కరజాడ, చాపర వైద్యులు గ్రీష్మ, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బగ్గు పరామర్శ

జలుమూరు: శ్రీముఖలింగం సర్పంచ్ తమ్మన్నగారి సతీష్‌కుమార్ తల్లి ఇందుమతి మృతి చెందడంతో ఆయనను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనర్ బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీష విరాళం

పలాస: వరద బాధితుల సహాయనిధికి ఎమ్మెల్యే గౌతు శిరీష తన నెల వేతనాన్ని అందించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మహిళలు పోషకాహారాన్ని తీసుకోవాలి

పాతపట్నం: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విధిగా తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో టి.విమలారాణి అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏఎస్‌కవిటి అంగనవాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.అనూరాధ, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.రమ, సహాయకురాలు ఎస్.భూలక్ష్మి పాల్గొన్నారు

కౌలు రైతులను ఆదుకోవాలి

టెక్కలి: కౌలురైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘ నాయకులు కోరారు. మంగళవారం మేఘవరం పంచాయతీ జక్కరపేట, భీంపురం, బొరిగిపేట, కోదండపురం, జీడిపేట తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. కౌలురైతులకు ప్రత్యేక కార్డులు అందించాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే, జక్కరపేట రోడ్డు పనులు పూర్తిచేయాలని, గిరిజనులకు వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం మేఘవరం సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, అప్పారావు, రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

ఎల్.ఎన్.పేట: తమ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని వంశధార ఫేజ్-2లోని తులగాం నిర్వాసితులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండల ప్రత్యేకాధికారి పి.కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన జి.ప్రశాంతకుమార్, జి.కృష్ణారావు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా మారుస్తాం

ఎల్.ఎన్.పేట: మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడమే లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు భవనంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 5,823 మంది మహిళలకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు బ్యాంకుల ద్వారా లింకేజి రుణాలు ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 296 మందికి అందించినట్లు తెలిపారు. రెండు నెలల్లో 50 శాతం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాతపట్నం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేడాడ జయంత్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

పాతపట్నం: చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంఈవోలు బి.శ్రీధర్, తిరుమలరావు అన్నారు. లాబర గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న పుల్లేటి సూర్యనారాయణ సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయనను మంగళవారం ఎంఈవోలు, తదితరులు సన్మానించారు. ఎంపీడీవో పేడాడ జయంత్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పలాసరూరల్:** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన బ్రాహ్మణతర్లా హైస్కూల్ సైన్స్ టీచర్ కొయ్యల శ్రీనివాసరావును ఉపాధ్యాయ బృందం సత్కరించింది. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్‌వీ.రమణారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా టెన్నికాయిట్ జట్టు ఎంపిక

పలాస: జిల్లా టెన్నికాయిట్ సబ్‌జూనియర్ బాలబాలికల జట్లను మంగళవారం ఎంపిక చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో ఈ ఎంపికలు నిర్వహించారు. బాలుర జట్టులో టి.వెంకటేష్, కె.జయంత్(పలాస), టి.అభిరామ్, డి.భార్గవ్(ఎంజేపీ శాస్త్రులపేట), బాలికల జట్టుకు పి.శ్రావణి, వై.వరలక్ష్మి, ఎస్.దివ్య (పలాస), ఆర్.పవిత్ర(కవిటి అగ్రహారం)ఎంపికయ్యారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు బలోపేతం చేయాలి

నరసన్నపేట: ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులకు పునశ్చరణ శిక్షణ ఎంతో దోహదపడుతుందని, అందుకు స్కూల్ కాంప్లెక్స్‌లను పునఃనిర్మాణం చేసి బలోపేతం చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడులు సూచించారు. మంగళవారం ఉన్నత పాఠశాలలు హెచ్ఎంలు, సీఆర్ఎంటీలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

నష్టపరిహారం అందిస్తాం

మెళియాపుట్టి: గంగరాజపురంలో ఇంటి గోడ కూలిన సంతోష్‌బిశ్వాల్ కుటుంబాన్ని బీజేపీ నియోజకవర్గ కన్వనర్ సలాన శరత్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. వర్షాలతో నష్టపోయిన బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మత్స్యకారులకు ప్రత్యేక రేషన్ అందించాలి

సంతబొమ్మాళి: వేట లేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు ప్రత్యేక రేషన్ అందించాలని టీడీపీ మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, ఎంపల్లి జోగారావు కోరారు. గత పది రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మత్స్యకారులు వేటకు వెళ్లడం లేదన్నారు. వారికి ప్రత్యేక రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పెట్టుబడి సాయం అందించాలి

కాశీబుగ్గ: ప్రభుత్వం రైతులకు ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు తక్షణమే అందించాలని రైతు సంఘాల నాయకులు అజయ్‌కుమార్, రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాశీబుగ్గ సంతమైదానంలోని సచివాలయ అధికారులకు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింహాద్రి, గణపతి, శ్రీనివాస్, దాలమ్మ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఎచ్చెర్ల: కుంచాలకురమయ్యపేటలోని దుర్గా ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసివేసి ఉన్న ఆలయ తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు గర్భగుడిలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఆరు కిలోల వెండి, ఒకటిన్నర తులాల బంగారం, అమ్మవారికి అలంకరించిన నగలు, పుస్తెలతాడును దొంగలు అపహరించుకుపోయారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ శ్రీనివాసరావు, క్లూస్ టీమ్ సందర్శించి వివరాలను సేకరించారు. ఆలయ ధర్మకర్త బొచ్చ నర్సింగరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల కళ్లుగప్పి గంజాయిబాబు పరారీ

● విచారణ సమయంలో హెడ్‌కానిస్టేబుల్ నిద్రావస్థే కారణమా?

శ్రీకాకుళం క్రైం: గంజాయి రహిత జిల్లాయే లక్ష్యంగా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం దాడులు చేపట్టి నియంత్రిస్తుంది. ఈ క్రమంలో శ్రీకాకుళం నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 22 కిలో గంజాయితో పాటు ఒడిశాకు చెందిన గంజాయి వ్యాపారిని, అతడికి సహకరించే వ్యక్తితో పాటు నగరానికి చెందిన గంజాయి ట్రాన్స్‌పోర్టర్స్ ఏడుగురిని ఇటీవల పోలీసులు అరెస్టు చేసి విచారిస్తుండగా, రెండు రోజుల కిందట శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ గంజాయి ట్రాన్స్‌పోర్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ రాత్రి స్టేషన్‌లోనే అతడి ఉంచగా, పోలీసుల కళ్లుగప్పి పరారైనట్టు తెలుస్తుంది. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్ నిద్రావస్థలో ఉండటమే దీనికి కారణమని పోలీసు వర్గాలు గుసగుసలాడుతున్నాయి. అయితే ఆ వ్యక్తి చనిపోయిన ఓ కానిస్టేబుల్ కుమారుడని విచారణలో లేటతెల్లమైంది. ఈ విషయం జిల్లా పోలీసు బాస్ దృష్టికి కూడా వెళ్లడంతో ఆయన కూడా దీనిపై సీరియస్‌గా ఉన్నట్లు భోగట్టా. ప్రస్తుతం పరారీలో ఉన్న వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నట్టు తెలుస్తుంది. కాగా ఈ ఘటనపై డీఎస్పీ వివేకానందను వివరణ కోరాగా.. గంజాయి కేసులో ఒక వ్యక్తిని విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు తీసుకురాగా.. అతడు తప్పించుకుని పారిపోవడం వాస్తవమేనన్నారు. తప్పుడు సమాచారం ఇవ్వడంతో బయపడి ఆ వ్యక్తి ఇంటికి పారిపోయాడు, అతడి తల్లి పోలీసులకు అప్పగిస్తానని చెప్పారు.

మహిళకు బ్యాగ్ అప్పగింత

పలాస: రైలులో మరిచిపోయిన బ్యాగ్‌ను పలాస రైల్వే పోలీసులు గుర్తించి మహిళకు అప్పగించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ షరీఫ్ వివరాల మేరకు.. మందస మండలం బేతాళపురం గ్రామానికి చెందిన కీలు మహాలక్ష్మి అనే మహిళ హౌరా-చెన్నై మెయిల్‌లో వస్తూ పలాస రైల్వే స్టేషన్‌లో దిగే క్రమంలో తన బ్యాగును మరిచిపోయింది. అందులో 3 తులాల బంగారు ఆభరణాలు, పట్టుచీరలు మొత్తం రూ.3 లక్షల విలువైన వస్తువులు ఉన్నాయి. దీంతో మహాలక్ష్మి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తక్షణం స్పందించిన పోలీసులు రైలులో బ్యాగును గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అందులో మహాలక్ష్మి చెప్పిన వివరాల మేరకు ఆభరణాలు, నగదు, దుస్తులు ఉండడంతో ఆమెకు అందించారు. రైల్వే ఎస్ఐ షరీఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శంకర్‌బిస్వాస్, పాణిగ్రాహి, హెచ్‌సీ హరినాథ్, నవీన్ పాల్గొన్నారు.

లెక్కలు సరిగా చేయడంలేదని..

● విద్యార్థిని తీవ్రంగా కొట్టిన ఉపాధ్యాయుడు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

● షోకాజ్ నోటీసు జారీచేసిన ఎంఈవో



మోక్షిత్ ఒంటిపై పడిన తట్లు

టెక్కలి: లెక్కలు సరిగా చేయడం లేదని ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు బెత్తంతో తీవ్రంగా కొట్టాడు. దీనిపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఎంఈవో దృష్టికి తీసుకెళ్లడంతో ఆ ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. టెక్కలి మేజర్‌పంచాయతీ బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉదయపురం మోక్షిత్ అనే విద్యార్థి నాల్గో తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు వచ్చిన మోక్షిత్ లెక్కలు సరిగ్గా చేయడం లేదంటూ ఉపాధ్యాయుడు పల్లి వేణుగోపాలరావు బెత్తంతో తీవ్రంగా కొట్టాడు. సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులు సుధీర్, సుకన్యలకు మోక్షిత్ చెప్పాడు. దీంతో వారు మోక్షిత్‌కు షర్టు విప్పి చూడగా వీపుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎర్రగా కందిపోయిన దెబ్బలను గుర్తించారు. హుటాహుటిన ఆ బాలుడిని సమీపంలో ఉన్న టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర యువజన కార్యదర్శి రెయ్యి ప్రీతీష్ వద్దకు తీసుకెళ్లి జరిగిన విషయాన్ని చెప్పారు. అక్కడి నుంచి ఎంఆర్‌సీ కేంద్రానికి వెళ్లి తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల విద్యాశాఖాధికారులు డి.తులసీరావు, చిన్నారావులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత ఎంఈవోలు ఉపాధ్యాయుడు వేణగోపాలరావును అక్కడకు పిలిపించి విషయంపై ఆరాతీశారు. అయితే, మోక్షిత్ లెక్కలు చేయకపోవడంతో తాను కొట్టానని, కొట్టినప్పుడు విద్యార్థి అంతగా స్పందించలేదని ఉపాధ్యాయుడు బదులిచ్చాడు. దీంతో ఆయనకు ఎంఈవో తులసీరావు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మోక్షిత్‌ను వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

కుంటిభద్రలో భూ వివాదం

● ఇరువర్గాల మధ్య కొట్లాట ● నలుగురికి గాయాలు

కొత్తూరు: కుంటిభద్ర గ్రామంలో మంగళవారం ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కుంటిభద్ర గ్రామానికి చెందిన అగతముడి గోవిందరావుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య ప్రభావతి, రెండో భార్య కాంతమ్మ. వీరి మధ్య గత కాలంగా భూవివాదం నడుస్తోంది. గోవిందరావు మృతి చెందడంతో రెండో భార్య తన వంతు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న 25 సెంట్ల భూమిని కాంతమ్మ కుమార్తె మంజు ట్రాక్టర్ ద్వారా దున్నించింది. అయితే, ట్రాక్టర్ గట్టు మధ్యలో ఇరుక్కుపోవడంతో మధ్యవర్తి అయిన కుంటిభద్ర కాలనీకి చెందిన అగతముడి అప్పలనాయుడుకు కాంతమ్మ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో ఆయన తాడు పటుకొని పొలం వద్దకు చేరుకున్నాడు. ఇంతలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మొదటి భార్య కుమారుడు షణ్ముఖరావు పొలం వద్ద చేరుకున్నాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య మాటామాటా పెరగడంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో మధ్యవర్తి అప్పలనాయుడుపై షణ్ముఖరావు కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ఆటోలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ కొట్లాటలో మొదటి భార్య ప్రభావతికి తలకు గాయం కాగా, రెండో భార్య, కుమార్తెలకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. వీరిని కూడా స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అప్పలనాయుడు, ప్రభావతిని 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

ఇచ్ఛాపురం: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ చెలమాజీ అన్నారు. మంగళవారం ఈదుపురం పీహెచ్‌సీలో వైసీటీ ప్రివేన్షన్ యూనిట్ ట్రక్కర్స్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించి హెచ్‌ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌పై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 1097 టోల్‌ఫ్రీ నెంబరు ప్రాధాన్యతను హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్ వివరించారు. రమ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన లక్ష్యంగా జాబ్‌మేళాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఎచ్చెర్ల: యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు ఐటీఐ అడ్మిషన్ల జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం ఏపీ ఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ జాబ్‌మేళాకు 119 మంది హాజరు కాగా వీరిలో 47 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.వంశీకృష్ణ, ఐటీఐ సీనియర్ ట్రైనింగ్ ఆఫీసర్ బి.కామేశ్వరరావు, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ బి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

లావేరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో కె.సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈనెల 15న నిర్వహించనున్న ఇంజినీర్స్‌డేను పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఇంజనీరింగ్ అధికారి ఎల్.అప్పన్న, జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎస్ఐ జి.లక్ష్మణరావు, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన నదులు, వాగులు

● జల దిగ్బంధంలో గ్రామాలు

● రాకపోకలకు ఇబ్బందులు



ఇన్నేసుపేట గ్రామంలో చేరిన వరద నీరు



పొందూరు: తాడివలస వద్ద నీట మునిగిన పంట పొలాలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 10: గత రెండు రోజులుగా కుండపోత వర్షాలతోపాటు ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు భారీగా దిగువకు వస్తుండడంతో బాహుదా నది, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇన్నేసుపేట వద్ద పద్మపురం గెడ్డ పొంగడంతో వందలాది ఎకరాల పంట నీటి మునగటమే కాకుండా రోడ్డులపై నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. భారీ వర్షాల కారణంగా ఇన్నేసుపేట, తులసిగాం, ధర్మపురం, కొఠారి, మండపల్లి, రత్తకన్న గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. రత్తకన్న వద్ద గల భీమసముద్రం గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో రత్తకన్న గ్రామం పరిధిలోని పంట పొలాలు నీటమునిగాయి. భారీ వర్షాలకు సుమారుగా 500 ఎకరాల్లో పంట నీట మునిగాయని వ్యవసాయ శాఖ అధికారిణి భార్గవి తెలిపారు. నీటమునిగిన పంట పొలాలను ఆమె మంగళవారం పరిశీలించారు. అయితే నీట మునిగిన పంట పొలాల నుంచి నీరు రెండు మూడు రోజుల్లో వరకు ఉన్నా పంటకు ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు.

ముంపులోనే పంట పొలాలు

పొందూరు: అల్పపీడనంతో కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టినా చాలా గ్రామాల్లో వరి పంట నీటి ముంపులోనే ఉన్నాయి. సోమవారం నుంచి వర్షాలు తగ్గినా రెల్లిగెడ్డలో నీరు ఉధృతంగానే ప్రవహిస్తుంది. దీంతో నీరు ఇంకా పొలాల్లోనే ఉంది. దీంతో నాలుగు రోజులుగా గోరింట, గోకర్ణపల్లి, లైదాం, తాడివలస, మొదలవలస, బొడ్డేపల్లి గ్రామాలలో వరిపంట ముంపులోనే ఉంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరినారు కుళ్ళిపోతే తీవ్రంగా నష్టపోతామని ఆదేన వ్యక్తం చేస్తు న్నారు.

పంట పొలాల పరిశీలన



నారాయణపురం ఆనకట్టను పరిశీలిస్తున్న అధికారులు

బూర్జ: కాళపర్తి, జీకే పురం గ్రామంలో నీటమునిగిన పంట పొలాలను తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం నారాయణపురం ఆనకట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడారు. నీటి మునిగిన పంటను రక్షించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

రైతులకు నష్టం కలగకుండా చర్యలు



బీలప్రాంతంలో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న ఎమెల్యే అశోక్

కవిటి: భారీ వర్షాల కారణంగా వరిపంట ముంపునకు గురైన పొలాలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పుక్కళ్లపాలెం, ఇద్దివానిపాలెం గ్రామాల వద్ద పొగురు తీత పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అలాగే నీట మునిగిన పొలాలను పరిశీలించారు. పంట నష్టాలను అంచనా వేయాలని ఆదేశించారు. రంగాల గెడ్డ, బీలబట్టిల వద్ద వరదనీటి ప్రవాహాన్ని సముద్రంలో కలిపేందుకు చర్యలు చేపట్టామన్నారు. పొగురుతీతతో రైతులకు వరద ముంపు సమస్య తప్పుతుందన్నారు. టీడీపీ నేతలు బి.రమేష్, ఎ.మధు, వి.రంగారావు, తహసీల్దార్ మురళీమోహనరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

● హోం మంత్రి వంగలపూడి అనిత



మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టం, తీసుకున్న సహాయ చర్యలపై విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతా రామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం ఉదయం విశాఖ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విజయవాడలో మాదిరిగా సహాయ రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లాలోని జలాశయాల స్థితిగతులపై కలెక్టర్లు సమీక్షిస్తుండాలని ఆదేశించారు. పనిచేయని, పాడైన రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. భారీవర్షాల సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాలో ముంపు, పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ముందుగా తరలించేందుకు వీలుంటుందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడడమే కాకుండా, సహాయ చర్యల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు వారి బోట్లను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేసి వారికి ప్రకృతి వైపరీత్యాలు సమయంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనివల్ల ముందస్తు రక్షణ చర్యలకు అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో శాశ్వత టోల్‌ఫ్రీ, ల్యాండ్ లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో కురిసిన భారీవర్షాల వల్ల జిల్లాలో కొంత మేర నష్టం వాటిల్లినట్టు తెలిపారు. ఎక్కడికక్కడ సహాయ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డీవోలు హుస్సేన్ సాహెబ్, పి.భాస్కర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరా, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

13 నుంచి జిల్లా స్కూల్‌గేమ్స్‌కు ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 బాలురు, బాలికల జిల్లాస్థాయి క్రీడా ఎంపికల తేదీలు ఖరారు చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, కార్యదర్శి బీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికలు ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 13వ తేదీన బాస్కెట్‌బాల్, సపక్‌తక్ర, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లో ఎంపికలు జరుగుతాయని, ఈ నెల 20న అండర్-14 చెస్ బాలబాలికలు, అండర్-17, 19 బాలికలకు మాత్రమే ఎచ్చెర్ల జీహెచ్ఎస్‌లో జరుగుతాయన్నారు. ఈ నెల 21న జూడో జడ్పీహెచ్ఎస్ (ఒప్పంగి), స్విమ్మింగ్ (శాంతినగర్ కాలనీ, శ్రీకాకుళం), తైక్వాండో, ఫెన్సింగ్ (టౌన్‌హాల్, శ్రీకాకుళం), టెన్నికాయిట్ (జీహెచ్ఎస్ పలాస), బేస్‌బాల్ (శ్రీకాకుళం)లో జరుగుతాయన్నారు. అదేవిధంగా ఈ నెల 26న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ (బాలికలు) ఆర్చరీ, హాకీల్లో ఎంపికలు ఉంటాయని, 27న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ (బాలురు), బాక్సింగ్‌ల్లో ఎంపికలు జరుగుతాయని, ఈ నెల 28న యోగా, సాఫ్ట్‌బాల్, బాల్ బాడ్మింటన్ త్రోబాల్, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, రగ్బీ, నెట్‌బాల్, లాన్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, రోప్ స్కేటింగ్‌లో, ఈ నెల 30న అథ్లెటిక్స్ ఉంటుందన్నారు. అండర్-14 క్రీడాకారులు 2011 జనవరి 1 తర్వాత, అండర్-17 క్రీడాకారులు 2008 తర్వాత, అండర్-19 క్రీడాకారులు 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు

అరసవల్లి: ఆత్మహత్యలు వద్దు.. ప్రాణాలే ముద్దు అంటూ రిమ్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహిం చారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మిచెల్ మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడికి లోనై యువత ఆత్మహత్యలకు పాల్పడి విలువైన ప్రాణాలు తీసుకుంటున్నారని, జీవితం ఎంతో విలువైనదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో కె.పద్మావతి, ఏపీవో పి.సునీత, అధ్యాపకులు హరిప్రియ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



వరద బాధితులకు పంపేందుకు సిద్ధం చేసిన సామగ్రి

గుజరాతీపేట: విజయవాడ వరద బాధితులకు కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు అండగా నిలిచారు. ఈ మేరకు విద్యార్థుల సేకరించిన నిత్యావసర సరుకులతోపాటు బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌లను అందజేశారు. కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎం.డిల్లేశ్వరరావు మాట్లాడుతూ.. ఇలాంటి విపత్తు సమయంలో మనమంతా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విపత్తు సమయాల్లో నిరాశ్రులైన వారిని ఆదుకోవాలని కోరారు.

దేశవ్యాప్త ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

కలెక్టరేట్: ఆర్‌బీఐ స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులంతా పాల్గొనాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఒక కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇద్దరు విద్యార్థులు ఒక టీమ్‌గా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1.5లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష ఉంటుందని, జోనల్ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, రెండో బహుమతి రూ.4లక్షలు, మూడో బహుమతి రూ.3 లక్షలు ఉంటుందని, అలాగే జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని డిగ్రీ చదువుతున్న విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

పొన్నాం వద్ద బోనగట్టుకు రక్షణ నిర్మాణం

● ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో పనులు



కోతకు గురైన చోట గట్టుపోసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: పొన్నాం వద్ద వంశధార నది ఆనుకుని ఉన్న బోనగట్టు కోతకు గురైంది. వైసీపీ హయాంలో అక్రమార్కులు ఇక్కడ అనధికార ర్యాంపు నిర్వహించి.. బోనగట్టును కొంతమేర తొలగించారు. ఈ క్రమంలో వంశధారకు నదిలో ప్రవాహం పెరిగితే.. ఈ బోనగట్టు గుండా నీరు పొలాల్లోకి చేరి వేలాది ఎకరాల్లో పంట ముంపునకు గురయ్యేది. ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకున్నా.. గత పాలకులు పట్టించుకోలేదు. తాజాగా ఇటీవల వర్షాలకు వంశధారలో ప్రవాహం పెరిగి.. మళ్లీ పొలాల్లో వరదనీరు చేరింది. దీంతో పొన్నాం గ్రామస్థులు, రైతులు ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి.. తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. ఎమ్మెల్యే శంకర్.. కలెక్టర్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. ఈక్రమంలో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆర్డీవో రంగయ్య, ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గణపతిరావు, ఇంజనీర్ అధికారులు బోనగట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. మంగళవారం 100 మీటర్ల పొడవు, నాలుగు మీటర్ల ఎత్తున గట్టు నిర్మించారు. వేసవిలో శాశ్వత పనులు చేపడతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురుగు లక్ష్మణ, వంకాయల ప్రకాష్, డి.ఆనందరావు, జి.అప్పలనాయుడు, నర్సింగరావు, మార్కండేయులు, వెంకటరావు,అప్పలరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తమ్మినేనికి బెస్ట్ స్టార్టప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మురళీకృష్ణ

ఎచ్చెర్ల: జిల్లాకు చెందిన యువ పారిశ్రామికవేత్త తమ్మినేని మురళీకృష్ణకు ఔట్‌లుక్ మేగజైన్ అగ్రిటెక్ సమ్మిట్ నుంచి స్టార్టప్ అవార్డు అందుకున్నారు. ఆమదాలవలస మండలం తొగరాం గ్రామానికి చెందిన తమ్మినేని మురళీకృష్ణ ఎం.ఫార్మసీ పూర్తి చేసిన తర్వాత కొన్నాళ్ల పాటు ఉద్యోగం చేశారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం (ఆమదాలవలస)లో శిక్షణ పొంది.. సొంతంగా మిల్లెట్లతో బిస్కెట్ల తయారీ యూనిట్‌ను ఎచ్చెర్ల మండలం పెయ్యలవానిపేటలో మూడేళ్ల కిందట ఏర్పాటుచేశారు. ఈ యూనిట్‌ను బాగా నడుపుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో మిల్లెట్స్ బిస్కెట్లు సరఫరా చేస్తున్నారు. మురళీకృష్ణ విజయవంతంగా యూనిట్‌ను నడుపుతుండడంతో ఔట్‌లుక్ మేగజైన్ వారు స్టార్టప్ అవార్డును సోమవారం న్యూ ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ అవార్డు ఇచ్చిన ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతానని చెప్పారు.

అన్నదానం మహాదానం



స్వామివారిని దర్శించుకుంటున్న సూర శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: అన్నదానం మహాదానమని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎస్ఎం పురం గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఆధ్యాతిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మూడు మంది అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆమె నేత్రాలు సజీవం



ఎచ్చెర్ల: ఎచ్చెర్ల సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఉప్పలపాటి సావిత్రమ్మ(70) మంగళవారం మృతిచెందారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా కార్నియాను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రం (విశాఖ)కు పంపించారు. నేత్రదానం చేయాలనుకున్నవారు 78426 99321లో సంప్రదించాలని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

కంచిలి: బూరగాం, జేఎల్ కోటలో కంచిలి పీహెచ్‌సీ వైద్యులు హరిబాబు, నాగేంద్రల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. పెద్దకొజ్జిరీయ గ్రామంలో ఎంఎస్ పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.సాయి హర్షిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో వి.నీరజ పరిశీలించారు. మొత్తం 73 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా నలుగురికి జ్వర లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

పొందూరు: పారిశుధ్యం పనుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని శ్రీకాకుళం డీఎల్‌పీవో గోపిబాల హెచ్చరించారు. మేజరు పంచాయతీ పొందూరులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్య పనులను స్పెషల్ డ్రైవ్‌గా నిర్వహిస్తున్నామన్నారు. వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు క్లోరినేషన్, ఫాగింగ్ పనులు నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ ఆర్.లక్ష్మి, టీడీపీ నాయకులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గార: వంశధార నదిలో నీటి మట్టం పెరుగుతున్నందున తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి బి.శాంతిశ్రీ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో కలిసి ఆమె నదీ తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్ ఎస్.రమణారావు, ఆర్ఐ బి.అనిల్ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

● సరుబుజ్జిలి: వంశధార నదీపరివాహక ప్రాంత ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పీవీవీ మురళీ మోహన్‌కుమార్, తహసీల్దార్ ఎల్.మధుసూదన్ తెలిపారు. మంగళవారం వంశధార నది పరివాహక ప్రాంత గ్రామాలైన పాతపాడు, తెలికిపెంట, యరగాం, మూలపేట గ్రామాల్లో పర్యటించి గ్రామాల్లో దండోరా వేయించడంతో పాటు మైకుల ద్వారా ప్రచారం చేయించారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

ఎచ్చెర్ల: ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. స్థానిక క్యాంపస్‌లో మంగళవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. మానసిక ఆరోగ్య వైద్య నిపుణుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి చిన్న విషయాన్ని తీవ్రంగా పరిగణించొద్దన్నారు. డాక్టర్ అచ్యుత్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను అధ్యాపకులు, స్నేహితులు, తల్లిదండ్రులతో చర్చిస్తే ఉపశమనం లభిస్తుందన్నారు. ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి. ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగావకాలు

ఎచ్చెర్ల: ఐటీఐ చదివిన అభ్యర్థులకు అశోకలైలాండ్ కంపెనీ వారిచే నేరుగా దుబాయి, యూఏఈలో తదితర దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎల్.సుధాకరరావు తెలిపారు. ఈ నెల 12న ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఐటీఐ, కంచరపాలెం, విశాఖలో ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆటో పెయింటర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు.

క్విజ్ పోటీల విజేత గోకర్ణపురం

ఇచ్ఛాపురం: ఈదుపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలో గోకర్ణపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. శ్రీబేతాళ యువజన సంఘం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఈదుపురంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో 27 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ గోకర్ణపురం, ద్వితీయ స్థానం జడ్పీహెచ్ఎస్ బొరివంక, తృతీయ స్థానం కవిటి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. వ్యాసరచన పోటీలో పి.జయలక్ష్మి(రాజపురం ఏపీ మోడల్ స్కూల్), కె.జగన్(బూర్జుపాడు జడ్పీహెచ్ స్కూల్), కె రజని(జడ్పీహెచ్ఎస్ లొద్దపుట్టి) వరుస స్థానాల్లో నిలిచారు. డ్రాయింగ్ కాంపిటేషన్‌లో బసవ లిఖిత (జడ్పీహెచ్ఎస్ ఆర్.బెలగాం), బితనూజ గెలుపొందారు. సర్పంచ్ నర్తు ప్రసాద్, ఎంపీడీవో, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

ఇచ్ఛాపురం: ప్రతీ విద్యార్థి దంత సంరక్షణను కాపాడుకోవాలని దీంతోపాటు సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ దంత వైద్య నిపుణులు మోహన్ వెంకటేష్ అన్నారు. జేసీఐ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బెల్లుపడ గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.